క్లుప్తంగా

శంకరమఠంలో చండీహోమం

నెల్లూరు(బృందావనం): మూలాపేట శంకర మఠం ప్రాంగణంలోని కామాక్షి సమేత చంద్రమౌళీశ్వర స్వామి ఆలయంలో ఆదివారం 133వ చండీహోమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కంచి కామకోటి పీఠానికి చెందిన వేద పండితులు సోమేశ్వరశర్మ ఆధ్వర్యంలో విశేషంగా నిర్వహించిన ఈ హోమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఉభయకర్తలుగా సముద్రాల మురళీకృష్ణ దంపతులు వ్యవహరించారు. కార్యక్రమాలను శంకర మఠం నిర్వాహకులు కొర్రపాటి నందకిశోర్, ఉషాకుమారి దంపతులు పర్యవేక్షించారు.

టీబీపై అవగాహన

నెల్లూరు(అర్బన్): ప్రపంచ టీబీ నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక జాకీర్‌హుస్సేన్ నగర్‌లోని రాజేశ్వరి ప్రథమ చికిత్సాలయంలో ఆదివారం అవగాహన సదస్సు జరిగింది. కమ్యూనిటీ పారామెడిక్స్ ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ (పీహెచ్‌పీ) జిల్లా అధ్యక్షుడు శాఖవరపు వేణుగోపాల్ మాట్లాడారు. కార్యక్రమంలో పీహెచ్‌పీ గౌరవాధ్యక్షుడు జయప్రకాష్, నాయకులు శేషయ్య, దేవరకొండ శ్రీనివాసులు, ప్రసాద్, రామదాసు, వీరయ్య, మాల్యాద్రి తదితరులు పాల్గొన్నారు.

ఏసీ స్టేడియంలో ఉచిత వైద్య శిబిరం

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): ఏసీ స్టేడియంలో ఆదివారం ఫ్రెండ్స్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ మారం సుధాకర్ సూచనలిచ్చారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు బిరదవోలు రామ్మోహన్‌రెడ్డి, షేక్ నసీర్ అహ్మద్, కోశాధికారి శానంపూడి సుబ్బరాయుడు, వాకర్స్ ఇంటర్నేషనల్ కో–ఆర్డినేటర్ నలుబోలు బలరామయ్యనాయుడు, డాక్టర్ ఎంఎస్ రెడ్డి, నిజాముద్దీన్, సోను తదితరులు పాల్గొన్నారు.

• వేదాయపాళెం మహాత్మాగాంధీ పార్కులో ఆదివారం పరిశుభ్రత కార్యక్రమాన్ని నిర్వహించారు. మొక్కలు నాటారు. కార్యక్రమంలో వాకర్స్ ఉత్సాహంగా పాల్గొన్నారు.

వేమిరెడ్డి గురించి మాట్లాడితే సహించం

నెల్లూరు సిటీ: టీడీపీ నెల్లూరు పార్లమెంట్ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కోవూరు అభ్యర్థి ప్రశాంతిరెడ్డి గురించి అధికార పార్టీ నేతలు ఇష్టమొచ్చినట్లు మాట్లాడితే సహించేది లేదని తెలుగుదేశం నేతలు తెలిపారు. రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ఆదివారం కేవీఆర్ పెట్రోల్ బంకు సమీపంలోని తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. వేమిరెడ్డి దంపతులపై వైఎస్సార్‌సీపీ నేతలు మాట్లాడడం సరికాదన్నారు. ఇక డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్ యాదవ్ జేమ్స్ గార్డెన్స్‌లోని తన కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. వీపీఆర్‌ను ఏమైనా అంటే తాను నీచంగా మాట్లాడాల్సి వస్తుందని ఆయన అన్నారు.

గ్రంథావిష్కరణ

నెల్లూరు(బృందావనం): శ్రీరామహృదయం, హనుమద్గీత, శ్రీరామావతార వైభవం గ్రంథావిష్కరణలను పద్య కళాపరిషత్ ఆధ్వర్యంలో పురమందిరం ప్రాంగణంలోని వర్ధమాన సమాజం హాల్లో ఆదివారం నిర్వహించారు. మెట్టు రామచంద్రప్రసాద్ అధ్యక్షతన బ్రహ్మ విద్యాచార్య బ్రహ్మశ్రీ పోలూరి హనుమజ్జానకీరామశర్మ శతజయంత ఉత్సవాలు జరిగాయి. నలచరిత్రపై డాక్టర్ సూరం శ్రీనివాసులు ఉపన్యసించారు. కార్యక్రమంలో కళాపరిషత్ కార్యదర్శి చీమకుర్తి వెంకటేశ్వరరావు, కోశాధికారి నలుబోలు బలరామయ్యనాయుడు, నిర్వాహకులు వేదం రాధాకృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

తెలుగుదేశం ఓడిపోవడం ఖాయం

• వైఎస్సార్‌సీపీ ఎంపీ అభ్యర్థి విజయసాయిరెడ్డి
• పార్టీలో 100 మంది జనసేన వారు చేరిక

నెల్లూరు(దర్గామిట్ట): 'వైఎస్సార్‌సీపీకి ప్రజల నుంచి లభిస్తున్న ఆదరణ చూసి ఓర్వలేక టీడీపీ తప్పుడు ఆరోపణలు చేస్తోంది. వచ్చే ఎన్నికల్లో టీడీపీ ఓడిపోవడం ఖాయం. మా పార్టీ కార్యకర్తలు, నాయకుల్లో ఉత్సాహం ఉరకలేస్తోంది. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోమారు ముఖ్యమంత్రి చేయాలన్న లక్ష్యంతో పని చేస్తున్నారు' అని వైఎస్సార్‌సీపీ నెల్లూరు ఎంపీ అభ్యర్థి వేణుంబాక విజయసాయిరెడ్డి అన్నారు. జనసేన నేత జీవన్ ఆధ్వర్యంలో నెల్లూరు పార్లమెంట్ పరిధి నుంచి 100 మంది వైఎస్సార్‌సీపీలో చేరారు. రామ్మూర్తినగర్‌లోని విజయసాయిరెడ్డి కార్యాలయంలో ఆదివారం ఈ కార్యక్రమం జరిగింది.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్‌పై ఎంతో నమ్మకంతో జనసేన కార్యకర్తలు వైఎస్సార్‌సీపీలో చేరారన్నారు. నెల్లూరు పార్లమెంట్‌తోపాటు ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలను కైవసం చేసుకుంటామన్నారు. జనసేన చిన్న రాజకీయ పార్టీ అని, దానికి రాజకీయ భవిష్యత్ లేదన్నారు. ఏదో ఒక పార్టీతో కలిస్తే తప్ప ఒకటి రెండు సీట్లు రావని టీడీపీ, బీజేపీతో పొత్తు పెట్టుకుందన్నారు. నెల్లూరు ప్రజలు చూపిస్తున్న ఆదరణతో తాను తొలిసారిగా ప్రత్యక్ష ఎన్నికల్లో పోటీ చేస్తున్నాన్న భావన కలగడం లేదన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



వైఎస్సార్‌సీపీలో చేరిన జనసేన శ్రేణులతో విజయసాయిరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు

అంతర్జాతీయ ప్రమాణాలతో స్టేడియం అభివృద్ధి

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): 'నెల్లూరులోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంను అంతర్జాతీయ ప్రమాణాలతో అభివృద్ధి చేస్తాం. అధునాతన వసతులతో కూడిన క్రీడా మైదానాన్ని రూపొందిస్తాం' అని వైఎస్సార్‌సీపీ నెల్లూరు పార్లమెంట్ అభ్యర్థి వేణుంబాక విజయసాయిరెడ్డి, నెల్లూరు రూరల్ అభ్యర్థి ఆదాల ప్రభాకర్‌రెడ్డి వాకర్స్, క్రీడాకారులకు హామీ ఇచ్చారు. ఆదివారం ఉదయం స్టేడియంలో వారిద్దరు, ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, నెల్లూరు సిటీ అభ్యర్థి ఖలీల్ అహ్మద్ స్టేడియంలో వాకింగ్ చేశారు. ఈ సందర్భంగా తోటి వాకర్స్‌ను ఆత్మీయంగా పలకరించారు. బాగున్నారా అంటూ క్షేమ సమాచారం తెలుసుకున్నారు. నేతలతో ఫొటోలు తీసుకునేందుకు వాకర్స్ ఆసక్తి చూపారు. కార్యక్రమంలో విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, సీనియర్ న్యాయవాది మల్లిరెడ్డి కోటారెడ్డి, పార్టీ నగరాధ్యక్షుడు సన్నపురెడ్డి పెంచలరెడ్డి, స్వర్ణా వెంకయ్య, రాష్ట్ర సేవాదళ్ అధ్యక్షుడు మాలెం సుధీర్‌కుమార్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి వేలూరు శివసునీల్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు వేలూరు శ్రీధర్‌రెడ్డి, కార్పొరేటర్లు నేతాజీ సుబ్బారెడ్డి, బొబ్బల శ్రీనివాసయాదవ్, సురేష్‌రెడ్డి, పవన్ కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



వాకర్స్‌తో విజయసాయిరెడ్డి

భక్తిశ్రద్ధలతో మట్టల ఆదివారం

నెల్లూరు(బృందావనం): పొదలకూరురోడ్డులోని ది యునైటెడ్ క్రిస్టియన్ చర్చి (యూసీసీ) ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో మట్టల ఆదివారం జరిగింది. సంఘ పెద్దలు, స్త్రీలు, సండే స్కూల్ బాలబాలికలు ఈత మట్టలు చేతపట్టుకుని చర్చి పరిసర ప్రాంతాల్లో క్రైస్తవ గీతాలను ఆలపిస్తూ ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో సంఘ కాపరి ఎంఎం ఫారోస్, సంఘ పెద్దలు ఆర్.జయప్రసాద్, జి.విలియం జోసఫ్, ఎం.వినోద్‌కుమార్, కె.కిరణ్‌కుమార్, డి.దేవదానం పాల్గొన్నారు.

• నగరంలోని బాప్టిస్టు చర్చి డొనీహాల్ ఆధ్వర్యంలో వీఆర్సీ సెంటర్ వద్ద నుంచి గాంధీబొమ్మ వరకు జరిగిన ర్యాలీలో సండే స్కూల్ పిల్లలు ఉత్సాహంగా పాల్గొన్నారు. సంఘ కాపరి రెవరెండ్ కె.శ్యాంసన్ కుమార్ 'జయప్రవేశ' మహోత్సవ ప్రాముఖ్యతను వివరించారు. సంఘ కార్యదర్శి .జి.అరుణ్‌కుమార్ నేతృత్వంలో జరిగిన ఈ ర్యాలీలో సండే స్కూల్ సూపరింటెండెంట్ నివేదిత, టీచర్లు మెర్సీ, బ్రదర్ జానిజో, విద్యాధర్, మహేష్, అనిల్, రమేష్ పాల్గొన్నారు.



మట్టలతో చిన్నారులు, సంఘ పెద్దలు

ముమ్మరంగా సేవా కార్యక్రమాలు

ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డి

నెల్లూరు(అర్బన్): ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా శాఖ ద్వారా విస్తృత సేవా కార్యక్రమాలు చేపడుతున్నామని ఆ సంస్థ జిల్లా చైర్మన్, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. తలసేమియా డే కేర్ సెంటర్ అభివృద్ధి పనులకు డీపీ గోల్డ్ ప్రైవేట్ లిమిటెడ్ డైరెక్టర్ దిలీప్‌జైన్, రాహుల్ జైన్ వారి తల్లి జ్ఞాపకార్థంగా రూ.25 లక్షలు విరాళాన్ని ప్రకటించారు. ఆదివారం మద్రాస్ బస్టాండ్ సమీపంలోని రెడ్‌క్రాస్ కార్యాలయంలో ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డి చేతుల మీదుగా నగదు చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ రెడ్‌క్రాస్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో కేన్సర్ ఆస్పత్రి, బ్లడ్ బ్యాంకు, జనరిక్ మందుల షాపు, మానసిక దివ్యాంగుల కేంద్రం, తలసేమియా రోగులకు ఉచిత వైద్యసేవల కేంద్రం తదితర 13 ప్రాజెక్టుల ద్వారా సేవలు అందిస్తున్నామని తెలిపారు. జైన్ సోదరులు రూ.25 లక్షలు అందించడం అభినందనీయమన్నారు. అనంతరం దాతలను సత్కరించారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ వైస్ చైర్మన్ సుధీర్‌నాయుడు, కోశాధికారి సురేష్‌కుమార్‌జైన్, ఎంసీ మెంబర్స్ రాజేంద్రప్రసాద్, సురేష్, గునుపాటి ప్రసాద్‌రెడ్డి, శ్రీహరిరెడ్డి, ప్రసన్నాంజనేయులు, వాకాటి విజయకుమార్‌రెడ్డి, ఎంవీ సుబ్బారెడ్డి, తలసేమియా ప్రాజెక్ట్ కన్వీనర్ డాక్టర్ సీత తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్సీ చేతుల మీదుగా చెక్కును అందజేస్తున్న దాతలు

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

నెల్లూరు(అర్బన్): దీప్తి నర్సింగ్ హోమ్ 28వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం స్థానిక బృందావనంలోని ఆ ఆస్పత్రిలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా ఆస్పత్రి అధినేత డాక్టర్ లోకనాథం, గైనకాలజిస్ట్ డాక్టర్ సుమతి రోగులకు బ్లడ్ టెస్టులు, స్కానింగ్, ఎండోస్కోపిక్ పరీక్షలు ఉచితంగా నిర్వహించారు. గర్భిణులకు ఉచితంగా ఫీటల్ డాప్లర్ పరీక్షలు చేశారు. అనంతరం మందులు అందజేశారు.



రోగులను పరీక్షిస్తున్న డాక్టర్

డాక్టరేట్ ప్రదానం



మధుసూదన్‌రెడ్డి

నెల్లూరు(టౌన్): సిద్ధార్థ బీఈడీ కళాశాలలో ప్రిన్సిపల్‌గా పని చేస్తున్న గాజులపల్లె మధుసూదన్‌రెడ్డికి డాక్టరేట్ లభించింది. తిరుపతిలోని శ్రీవెంకటేశ్వర యూనివర్సిటీలో విశ్రాంత అధ్యాపకుడు దయాకర్‌రెడ్డి పర్యవేక్షణలో ఆయన నాన్ రెసిడెన్షియల్, రెసిడెన్షియల్ స్కూల్స్‌లో విద్యార్థులపై పరిశోధన చేశారు. డాక్టరేట్ అందుకున్న మధుసూదన్‌రెడ్డిని బీఈడీ కళాశాల అధ్యాపకులు ఆదివారం అభినందించారు.

వృద్ధురాలికి సాయం



నెల్లూరు(వీఆర్సీసెంటర్): అయ్యప్పగుడి వద్ద విక్రమ కాలనీ పార్క్ వద్ద ఒంటరిగా నివాసం ఉంటున్న సుగుణమ్మ అనే వృద్ధురాలికి ఆదివారం అమ్మ యూత్ ఫౌండేషన్ నిత్యావసర వస్తువులు అందజేసింది. 25 కేజీల బియ్యం, కూరగాయలు, నెలకు సరిపడా పప్పు ధాన్యాలు ఇచ్చారు. ఫౌండేషన్ నిర్వాహకులు రమేష్, శశికిరణ్, మాధవి పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ విజయానికి కృషి

నెల్లూరు(వీఆర్సీసెంటర్): వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపునకు కృషి చేస్తున్నట్లు ఆ పార్టీ సీనియర్ నాయకురాలు డాక్టర్ పల్లంరెడ్డి యశోధర తెలిపారు. ఆదివారం నగరంలోని తన కార్యాలయంలో ఆమె విలేకరులతో మాట్లాడారు. బీజేపీ ప్రతిపక్షాలను ఇబ్బంది పెడుతోందన్నారు. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ విజయమే లక్ష్యంగా శ్రేణులు పనిచేయాలని కోరారు. పవన్ కుమార్, విద్య, శ్రద్ధ, విజయలక్ష్మి పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో టీడీపీ నాయకుల చేరిక



ఆదాల ప్రభాకర్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న మైనార్టీ నేతలు

నెల్లూరు సిటీ: తెలుగుదేశం పార్టీ మైనార్టీ నాయకుడు షేక్ హయత్ బాషా (బాబా) వైఎస్సార్‌సీపీలో చేరారు. మినీబైపాస్ రోడ్డులో ఉన్న రూరల్ అభ్యర్థి ఆదాల ప్రభాకర్‌రెడ్డి కార్యాలయంలో ఆదివారం ఈ కార్యక్రమం జరిగింది. హయత్‌బాషాతోపాటు మిత్రబృందం వందలాదిమంది వైఎస్సార్‌సీపీ తీర్థం పుచ్చుకున్నారు. పార్టీలో చేరిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ ముస్లింలకు తీవ్ర ద్రోహం చేసిందన్నారు. చంద్రబాబును మైనార్టీలు నమ్మొద్దని కోరారు. ఆదాల మాట్లాడుతూ పార్టీలో చేరిన ముస్లింలకు అండగా ఉంటామన్నారు. అనంతరం ముస్లింలకు ఆదాల ఇఫ్తార్ విందును ఏర్పాటు చేశారు. రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, నాయకులు మలిరెడ్డి కోటారెడ్డి, వైవీ రామిరెడ్డి, కోటేశ్వరరెడ్డి, షేక్ ఖలీల్, పఠాన్ అస్లాం ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

26వ డివిజన్ నుంచి..

26వ డివిజన్‌లోని వంద మంది యువకులు ఆదాల సమక్షంలో ఆదివారం వైఎస్సార్‌సీపీలో చేరారు. ఆ డివిజన్ మాజీ కార్పొరేటర్ వెంకటేశ్వర్లు యాదవ్ ఆధ్వర్యంలో డ్రైవర్స్ కాలనీ, విక్రమ్ నగర్, త్యాగరాజనగర్‌కు చెందిన 100 మందికి ప్రభాకర్‌రెడ్డి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో షాహల్, షామీర్, సోను, అమర్, జి.హరిబాబు తదితరులున్నారు. కార్యక్రమంలో మేయర్ స్రవంతి, నెల్లూరు విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, నాయకులు, మలిరెడ్డి కోటారెడ్డి, సుధీర్‌కుమార్‌రెడ్డి, బిరదవోలు శ్రీకాంత్‌రెడ్డి, స్వర్ణా వెంకయ్య తదితరులు పాల్గొన్నారు.



ఆదాలను సన్మానిస్తున్న యువకులు

మాట్లాడేందుకు పిలిచి..

• వ్యక్తిపై హత్యాయత్నం

నెల్లూరు(క్రైమ్): స్నేహితుడిపై ఓ వ్యక్తి మరికొందరితో కలిసి హత్యాయత్నం చేసిన ఘటనపై సంతపేట పోలీసులు కేసు నమోదు చేశారు. వారి కథనం మేరకు.. కోటమిట్టకు చెందిన షేక్ మసూద్, బారకాస్ సెంటర్‌కు చెందిన సోహెల్ చిన్నప్పటి నుంచి ఎంతో స్నేహంగా ఉండేవారు. ఇటీవల వారు ఫోన్‌లో మాట్లాడుతుండగా మాటామాటా పెరిగి తిట్టుకున్నారు. దీంతో విభేదాలు చోటుచేసుకున్నాయి. సోహెల్ ఈనెల 23వ తేదీ శనివారం అర్ధరాత్రి మసూద్‌కు ఫోన్ చేసి మాట్లాడాలని రంగనాయకులపేట గొల్లవీధి వద్దకు రావాలని చెప్పాడు. దీంతో అతను మరో వ్యక్తితో కలిసి అక్కడికి వెళ్లాడు. అప్పటికే సోహెల్ తన స్నేహితులైన రైలు వీధికి చెందిన జావీద్, సాధిక్, సుభాన్, నవాజ్‌తో ఉన్నాడు. ఈ సమయంలో సోహెల్ తన స్నేహితులతో కలిసి మసూద్‌పై దాడి చేశాడు. కత్తితో పొడిచి అక్కడి నుంచి పరారయ్యారు. బాధితుడిని స్థానికులు ఆస్పత్రికి తరలించారు. అతను సంతపేట పోలీసులకు ఫిర్యాదు చేశాడు. నిందితులపై హత్యాయత్నం కేసు నమోదు చేశామని, వారి కోసం గాలిస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ సుబ్బరాజు ఆదివారం తెలియజేశారు.

నెల్లూరు చిత్రకారులకు చోటు

నెల్లూరు(బృందావనం): తిరుపతి అలిపిరిలోని శ్రీవేంకటేశ్వర శిల్ప కళాశాలలో ఆదివారం నిర్వహించిన శ్రీవేంకటేశ్వర చిత్రార్చన పుస్తకావిష్కరణ, చిత్ర కళా ప్రదర్శనలో నెల్లూరుకు చిత్రకారులు షేక్ అమీర్‌జాన్, ఎస్.అన్నపూర్ణ పాల్గొన్నారు. శ్రీకళాక్షేత్ర ఆర్టిస్ట్ అసోసియేషన్ సంస్థ నిర్వహించిన చిత్రార్చనలో దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన 200 మంది కళాకారుల చిత్రాలను పుస్తక రూపంలో ముద్రించారు.

రూరల్ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తా

• ఆదాల ప్రభాకర్‌రెడ్డి

నెల్లూరు సిటీ: 'రూరల్ నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తా. రాష్ట్రంలో నంబర్ వన్‌గా నిలబెట్టడమే నా లక్ష్యం' అని వైఎస్సార్‌సీపీ అభ్యర్థి ఆదాల ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. 21వ డివిజన్‌లోని బీవీ నగర్‌లో ఆదివారం సీనియర్ సిటిజన్స్‌తో మాట్లాడారు. తనకు ఇవే చివరి ఎన్నికలని, రూరల్‌ను అభివృద్ధి చేయడమే లక్ష్యమన్నారు. కార్యక్రమంలో మేయర్ స్రవంతి, డీసీసీబీ మాజీ అధ్యక్షుడు ఆనం విజయకుమార్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు గౌరి, నాయకులు మలిరెడ్డి కోటారెడ్డి, సన్నపురెడ్డి పెంచలరెడ్డి, సురేష్‌రెడ్డి, పాతపాటి పుల్లారెడ్డి, రాజారెడ్డి, వెంగళరెడ్డి, సాయి, బుజ్జన్న, మాల్యాద్రి, గురుస్వామి, సుబ్బారావు, మూలే విజయభాస్కర్‌రెడ్డి ఒరిస్సా శ్రీనివాసులు రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



వైఎస్సార్‌సీపీలో చేరిన వారితో ఆదాల

30 కుటుంబాల చేరిక

25వ డివిజన్‌లోని బుజబుజనెల్లూరులో ఆదాల ప్రభాకర్‌రెడ్డి సమక్షంలో ఆదివారం 30 కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరాయి. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు కోటారెడ్డి, ఏడుకొండలు యాదవులు, స్వర్ణా వెంకయ్య, కోటేశ్వరరెడ్డి, శ్రీనివాసులురావు, నవాబ్ జాన్, పెంచలయ్య, సుజాతమ్మ తదితరులు పాల్గొన్నారు.

సంబరాల హోలీ



శ్రీరంగనాథ నగర్‌లో వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో సంబరాలు

నెల్లూరు(బారకాసు): హోలీ పండగ.. చిన్నారుల నుంచి వృద్ధుల వరకూ అందరూ ఎంతో హుషారుగా చేసుకుంటారు. రంగులు చల్లుకుంటూ ఆనందంగా గడుపుతారు. సోమవారం పండగ సందర్భంగా ఒకరోజు ముందుగానే సంబరాలు మొదలయ్యాయి. భిన్నత్వంలో ఏకత్వానికి నిదర్శనం హోలీ. అలాగే ధనిక, పేద అనే తేడా లేకుండా అందరూ రంగుల లోకంలో విహరిస్తారు. రాజస్థాన్, గుజరాత్ తదితర రాష్ట్రాల నుంచి జైన్‌లు, మార్వాడీలు జీవనం కోసం జిల్లాకు విచ్చేసి ఇక్కడే స్థిరపడ్డారు. సుమారు మూడు వేలకు పైగా కుటుంబాలు ఉన్నట్లు అంచనా. ఇందులో నెల్లూరు నగరంలోనే వెయ్యికి పైగా కుటుంబాలున్నాయి. ఎన్నో ఏళ్లుగా వారంతా హోలీ పండగను ఆనందంత్సోహంతో చేసుకుంటున్నారు. నగరంలోని మండపాల వీధి, చిన్నబజార్, పెద్దబజార్, బారకాసు, పణుతలవారి వీధి తదితర ముఖ్యమైన ప్రాంతాల్లో సంబరాలను నిర్వహిస్తారు. ప్రస్తుతం అన్ని వర్గాల వారు హోలీని చేసుకుంటున్నారు.

నాడు.. నేడు

హోలీ ప్రకృతితో ముడిపడిన పండగ. ఒకప్పుడు పూలు, పండ్ల ద్వారా వచ్చిన రంగులనే వేడుకల్లో వాడేవారు. అడవికి వెళ్లి మోదుగుపూలు సేకరించేవారు. వాటిని ఉడికించగా వచ్చే ఎర్రని ద్రావణంలో పసుపు, కుంకమ కలిపి ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుంటూ సంబరాలు చేసుకునేవారు. కాలక్రమంలో వార్నిష్, సింథటిక్ రంగులను వాడుతున్నారు అవి ప్రమాదకరమని తెలిసినా వాడుతూనే ఉన్నారు. హోలీ ఆడే సమయంలో జాగ్రత్తలు తీసుకోవాలని చర్మ వ్యాధుల నిపుణులు సూచిస్తున్నారు. సహజ సిద్ధమైన రంగులతో జరుపుకోవాలని చెబుతున్నారు.

ఇలా చేస్తే..

రసాయనాలు కలిసిన రంగులతో హోలీ ఆడితే వాటిని శరీరంపై ఎక్కువ సమయం ఉంచకూడదు. వెంటనే చల్లని నీటితో శరీరాన్ని శుభ్రం చేసుకోవాలి. ఎక్కువగా ఎరుపు, పింక్ రంగులనే వాడాలి. ఇవి తక్కువ గాఢత కలిగి ఉండడం వల్ల శరీరంపై నుంచి సులభంగా పోతాయి. గ్రీన్, ఎల్లో, ఆరెంజ్ రంగులు ఎక్కువ రసాయనాలను కలిగి ఉన్న కారణంగా సులభంగా పోవు. హోలీ ఆడడానికి ముందు ముఖానికి మాయిశ్చరైజర్, తలకు నూనెను రాసుకుంటే మేలు. ముఖంపై పడిన రంగులను శుభ్రం చేసుకోవడానికి సబ్బు కన్నా క్లెన్సింగ్ మిల్క్ ఉత్తమమైంది.

ఎన్నో ఏళ్ల నుంచి చేసుకుంటున్నాం



దాదాపు 50 ఏళ్ల క్రితం మా కుటుంబం రాజస్థాన్ నుంచి నెల్లూరుకు వచ్చి స్థిరపడ్డాం. హోలీ సంబరాలను ప్రతి ఏటా ఎంతో సంతోషంగా చేసుకుంటాం.

– దినేష్ సింగ్, మండపాల వీధి

సరదాగా ఉంటుంది



హోలీ ఆడేందుకు స్నేహితులమంతా ఒక చోట చేరుతాం. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు సరదాగా రంగులు చల్లుకుంటాం.

– మహేష్ సింగ్, సంతపేట



రంగులు పూసుకుంటున్న యువతులు